క్లుప్తంగా

22 నుంచి పీడీఎస్‌యూ శిక్షణ తరగతులు



కరపత్రాలు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో ఈ నెల 22,23 తేదీలలో నిర్వహించే ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు కోరారు. మంగళవారం కడపలోని ప్రగతి హాస్పిటల్ భవనలో పీడీఎస్‌యూ తరగతుల కరపత్రాలను పీడీఎస్‌యూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులలో విద్యారంగ సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, నాయకులు తేజ, ఆజాద్, రాఘవ, సునీల్, సమద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలను అధిగమించాలి



మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

కడప కార్పొరేషన్ : మానసిక రుగ్మతలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని క్లినికల్ సైకాలజిస్ట్ కె.శిల్ప అన్నారు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాతకడప పట్టణ ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిద్రలేమి, తనలో తాను మాట్లాడుకోవడం, నవ్వుకోవడం, మద్యానికి బానిస కావడం, చేసిన పనినే పదే పదే చేయడం, మతిమరుపు, మితిమీరిన కోపం రావడం, ఒంటరితనాన్ని కోరుకోవడం, చనిపోవాలనే ఆలోచనలు ఎక్కువగా రావడం వంటివి ఉంటే డాక్టర్‌ను తప్పనిసరిగా సంప్రదించాలన్నారు. అలాగే చిన్నపిల్లల్లో ఆర్టిజం, బుద్ధిమాంద్యం కలిగి ఉంటే కౌన్సెలింగ్ ఇచ్చి మందులు అవసరమైన వారికి కడప రిమ్స్ హాస్పిటల్‌లో అందజేయడం జరుగుతుందన్నారు. డాక్టర్‌కు చెప్పలేని సమస్యలను టెలి మానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416 నంబర్‌కు ఫోన్ చేసి తెలుపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ వీరావతి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎడ్, డీఎడ్ కోర్సులు ప్రారంభించాలి



మను వీసీతో మాట్లాడుతున్న ఐటా నాయకులు

కడప ఎడ్యుకేషన్ : మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి చెందిన పాలిటెక్నిక్ కళాశాల(మను)లో డీఎడ్, బీఈడీ కోర్సులను ఉర్దూ మీడియంలో ప్రారంభించాలని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్(ఐటా) రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్‌రజాక్, కోశాధికారి ఫయాజుల్ కోరారు. ఈ విషయమై మంగళవారం కడప మను పాలిటెక్నిక్ కళాశాలకు విచ్చేసిన వైస్ చాన్సులర్ సయ్యద్ ఐనుల్ హసన్, విశ్రాంతి వీసీ రహమతుల్లా, డీన్ అబ్దుల్‌వాజిద్‌లను వారు కలిసి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప మనులో విద్యార్థులకు హాస్టల్ వసతి లేని కారణంగా రాష్ట్ర నలుమూలల నుంచి అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు వెనుకంజ వేస్తున్నారన్నారు. రాయలసీమ జిల్లాలతోపాటు గుంటూరు, ప్రకాశం జిల్లాలో ఉర్దూ మీడియం విద్యార్థులు ఎక్కువగా ఉన్నారన్నారు. మను యూనివర్సిటీ తరఫున నేటి అవసరాలకు తగ్గట్టుగా అడ్వాన్స్ కోర్సులను ప్రవేశపెడితే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభను విజయవంతం చేయండి

కమలాపురం : ఈనెల 7వ తేదీన వరంగల్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగే జాతీయ మహాసభను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం కమలాపురంలో జాతీయ మహాసభ కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. వికలాంగుల హక్కుల సాధనకై జరుగుతున్న జాతీయ మహాసభకు జిల్లాలోని ప్రతి మండలం నుంచి వికలాంగులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వికలాంగుల పింఛన్ రూ.3వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాతయ్య, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుబ్బరాయుడు, నగర అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాచెయ్య, తదితరులు పాల్గొన్నారు.

• దుర్గమ్మా.. దీవించమ్మా..



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : 'దుర్గమ్మా.. దీవించమ్మా..' అని భక్తులు వేడుకున్నారు. కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వెబ్‌సైట్‌లో వైవీయూ సమగ్ర సమాచారం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం(వైవీయూ) సమగ్ర సమాచారం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో లభిస్తుందని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యతో కలిసి ఆయన అప్‌లైడ్ మ్యాథమాటిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైకాలజీ, ఎర్త్ సైన్సెస్, ఆహార సాంకేతికత, వృక్షశాస్త్ర విభాగాల సమగ్ర సమాచారంతో కూడిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని 28 శాఖలు వివిధ రకాల సెల్‌ల సమాచారంతో విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ పరిపూర్ణత సంతరించుకుందన్నారు. ప్రతి ఒక్కరూ విశ్వవిద్యాలయంలో జరిగే ప్రతి ప్రగతి కార్యక్రమాన్ని వెంటనే అప్‌డేట్ చేసేలా చూడాలన్నారు. తద్వారా ప్రజలు, పరిశోధకులు, విద్యార్థులకు వెబ్‌సైట్ ప్రయోజనకారిగా మారుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, ఐటీసెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి.శంకర్, అధ్యాపకులు ఆచార్య శివప్రతాప్, డాక్టర్ మాధవి, రకీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లశాఖను తనిఖీ చేసిన వీసీ

విశ్వవిద్యాలయంలోని ఆంగ్లశాఖను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ ఆంగ్ల ప్రయోగశాలలో విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆంగ్లభాషలో భావవ్యక్తీకరణకు వినియోగించే వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అందరూ సమష్టిగా కృషిచేయడం ద్వారా శాఖల అభివృద్ధితోపాటు విశ్వవిద్యాలయం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆచార్య పుత్తా పద్మ, డాక్టర్ మెర్సీ విజేత, డాక్టర్ జయంత్ కశ్యప్, డాక్టర్ ఎన్.అంకన్న తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



పుష్పగిరి ఆసుపత్రిలో సోలార్ పవర్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో మేయర్ సురేష్‌బాబు

కడప రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగానే వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, తద్వారా పేదలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని కడప మేయర్ సురేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక రిమ్స్ సమీపంలోని పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్ (ఆసుపత్రి) క్యాంపస్‌లో ఐసీఐసీఐ బ్యాంక్ సహకారంతో రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్రాజెక్ట్ (120 కేవీ)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యాధునిక పుష్పగిరి కంటి ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు లభించడం ప్రశంసనీయమన్నారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌకర్యార్థం ఐసీఐసీఐ బ్యాంక్ సహకారంతో 120 కేవీ సామర్థ్యం గల సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ సౌత్ జోన్ హెడ్ బీకే వెంకటేష్ మాట్లాడుతూ తమ బ్యాంక్ ఆధ్వర్యంలో ఇక్కడ పర్యావరణానికి అనుకూలమైన సోలార్ పవర్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆ ఆసుపత్రి కంటి వైద్యులు విశాల్ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కావడం మంచి పరిణామం అని తెలిపారు. దీని కారణంగా విద్యుత్ బిల్లు చాలా వరకు తగ్గుతుందన్నారు. అలాగే సోలార్ విద్యుత్ వలన రోగులకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ ఆసుపత్రి యూనిట్ హెడ్ సూర్యప్రకాష్, బ్యాంక్ ప్రతినిధులు హరీష్ శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగుల నిరసన

కడప అర్బన్ : కాంట్రాక్ట్ ఉద్యోగుల తరహాలోనే ఔట్ సోర్సింగ్ (ఆప్కాస్) ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కడప రిమ్స్ ఓపీ విభాగం ఎదుట గంటసేపు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకట సుబ్బయ్య, వీవీ సుదర్శన్ మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎడ్యుకేషన్‌లో ఏమాత్రం తేడాల్లేవన్నారు. పని చేసే విధానాల్లో తేడాల్లేవు కానీ, వేతనాల్లో తేడాలున్నాయన్నారు. పర్మినెంట్ అయ్యేంత వరకు ఆప్కాస్ ఉద్యోగులకు సమాన పనికి, సమాన వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని ఆప్కాస్ కార్మికులకు అమలు చేయాలన్నారు. ఆప్కాస్‌లో పని చేస్తున్న ఉద్యోగుల తల్లిదండ్రులకు వికలాంగుల పెన్షన్‌లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వాటిని వెంటనే పునరుద్ధరించాలని, అలాగే ఎవరైతే అప్కాస్‌లో పని చేస్తూ వికలాంగులుగా వున్నారో వారి పింఛన్‌లు కూడా రద్దు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎల్.భాస్కర్, బి.బాలాజీరావు, ఏసన్న, రామకృష్ణ, చెన్నయ్య, కార్యదర్శులు కొండయ్య, సురేష్, రాజారత్నం, కమిటీ సభ్యులు జయరాం, సుబ్బారావు, ఏ లక్ష్మయ్య, బాదుల్లా, పి. పవన్, మరియమ్మ, జయసుధ, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కొరకు నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఆ పై కోర్సులు చదివిన విద్యార్థులు తమ వివరాలను కళాశాలలోని రిజిస్టర్ నందు నమోదు చేసుకోవాలన్నారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సాంబశివుడు 9966452542, సౌజన్య 8919860680 నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూనియన్ నాయకురాళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు సేవలు అందిస్తున్నారని, అయితే కొన్ని కేంద్రాల్లో సరైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరముందని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గంగావతి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మికి ఆ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేదని, మరికొన్ని కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం ఉన్నా బిల్లులు చెల్లించడం లేదన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి నిధులు పెంచి అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలని, అలాగే వర్కర్లకు మెయిన్ అంగన్వాడీల వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి నెల 21 నుంచి మరుసటి నెల 20వ తేది వరకు నెల కాకుండా ఒకటో తేది నుంచి 30వ తేది వరకు నెలగా పరిగణించాలన్నారు. సర్వీసు అర్హత కలిగిన హెల్పర్లకు అర్బన్ ఏరియాలో ఏ వార్డులోనైనా పదోన్నతి కల్పించాలని కోరారు. పిల్లలు, గర్భవతుల బరువులు కొలిచే యంత్రాలను సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం యూనియన్ నాయకులు పాల్గొన్నారు

స్వచ్ఛభారత్‌కు సమష్టిగా కృషి చేయాలి



ఆర్టీసీ బస్టాండు ఆవరణాన్ని శుభ్రపరుస్తున్న ఆర్టీసీ అధికారులు, ఎన్‌ఎస్‌ఎస్‌ఓ ప్రతినిధులు



ప్రమాణం చేస్తున్న ఆర్టీసీ అధికారులు, ఎన్‌ఎస్‌ఎస్‌ఓ ప్రతినిధులు, విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకాన్ని నివారించడం అనే అంశాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని కడప డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్‌ఓ డైరెక్టర్ నాగమల్లేశ్వరరావు, జిల్లా ప్రజారవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కడప ఆర్టీసీ బస్టాండులో స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సిబ్బందితో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి సంస్థ నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, పర్యావరణ సహిత అభివృద్ధి పరిరక్షణ ప్రధానమైనవన్నారు. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పక్షోత్సవాన్ని జూలై 1 నుంచి 15 వరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా కడపలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. స్వచ్ఛభారత్‌కు సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యామందిర్ హైస్కూలు విద్యార్థులు స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్నారన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్‌ఓ తరఫున సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్‌ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.రమేష్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకట్రావు తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్‌కన్యాకుమారి, డీఈఎస్ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' ప్రజలకు వరం



15వ డివిజన్‌లో అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రజలకు ఒక వరం లాంటిదని మేయర్ కె.సురేష్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక 29వ డివిజన్, 15వ డివిజన్లలో ×జగనన్న సురక్ష× శిబిరాలలో ఆయన పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందని, సర్టిఫికెట్లు ప్రజల వద్దకే వెళ్లి అందజేస్తారన్నారు. ఎక్కడైనా అర్హులై ఉండి ఏవైనా సంక్షేమ పథకాలు అందకపోతే వారికి కూడా పథకాలను వర్తింపజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌లు ముంతాజ్‌బేగం, నిత్యానందరెడ్డి, 15వ డివిజన్ ఇన్‌చార్జి వీరారెడ్డి, కార్పొరేటర్‌లు ఎస్‌ఎండీ రిజ్వాన్ బాషా, ఎం.రామలక్ష్మణ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జమాల్‌వలీ, సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీకృష్ణదేవరాయ బలిజ అభ్యుదయ సేవా సమితి

కడప కల్చరల్ : వంగవీటి మోహనరంగా 76వ జయంతిని మంగళవారం కడప నగరంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు రంగా చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ మోహనరంగా పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఎంతో పేరు గడించారన్నారు. అన్ని కులాలకు ఆశాకిరణంగా వారి ఆర్థిక, సామాజికాభివృద్ధికి కృషి చేశారన్నారు. అన్ని వర్గాల, కులమతాల ప్రజలను కలుపుకొని వెళ్లి పోరాట యోధుడిగా ఎదిగిన వ్యక్తి అని కొనియాడారు. జైలు నుంచి నామినేషన్ వేసి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన రంగా నాటి దుష్ట రాజకీయాలకు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణించి 35 సంవత్సరాలైనా నేటికీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఆయనకు గల పేరు తగ్గలేదన్నారు. ఆయన భావాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళతామని తెలిపారు. ఆయనను ప్రతి పార్టీ తమ వాడిగా భావిస్తుండటాన్ని గమనిస్తే ఆయనకు ప్రజల్లో ఉన్న అభిమానాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. కడప నగరంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు ఏనుగుల వెంకట సుబ్బయ్య, కొమ్మినేని రాఘవ, చిన్నప్పరెడ్డి, జక్కా శివ, మునిమోహన్‌రాయల్, సురేష్ రాయల్, తరుణ్, గోల్డ్ రవి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : నగరంలో రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం అంబేడ్కర్- వై జంక్షన్, దేవునికడప రోడ్, కేసీ కెనాల్‌రోడ్, గోకుల్ సర్కిల్- అన్నమయ సర్కిల్ రోడ్లను ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచరి వై జంక్షన్ వరకూ డ్రైనేజీ కాలువను లెవెలింగ్ ఆధారంగా నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. వీధి దీపాల స్తంభాలను మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ సిబ్బందికి తెలిపారు. వై జంక్షన్ నుంచి అప్సర వరకూ డ్రైనేజీ కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దేవునికడప రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా క్రిష్ణా సర్కిల్ నుంచి మాసాపేట వరకూ డ్రైనేజీ కాలువ పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. మాసాపేట సర్కిల్ నుంచి దేవునికడప వరకూ 100 అడుగుల మేర రోడ్డు నిర్మించేందుకు వీలుగా ఆక్రమణలు తొలగించాలన్నారు. గోకుల్ లాడ్జి- అన్నమయ్య సర్కిల్ రోడ్డును పరిశీలించి విస్తరణ పనులను చేపట్టాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, తహసీల్దార్ శివరామిరెడ్డి, ఆర్‌అండ్‌బీ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ చైర్మన్ బీపీ విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో లెక్కించారు. రెండు నెలలకు హుండీ ఆదాయం రూ. 1,72,084లు వచ్చిందన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి



జిల్లా కోర్టు ఎదుట ఐఏఎల్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కడప అర్బన్ : న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలని, వృత్తి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా అధ్యక్షుడు సి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఐఏఎల్ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన చేపట్టారు. న్యాయవాదుల డిమాండ్లను నెరవేర్చాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తి సంబంధిత కేసుల్లో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు, రక్షణకు 2021 ముసాయిదా బిల్లును చట్టంగా చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరి ఆంధ్రప్రదేశ్ కూడా 200 కోట్లు బార్ కౌన్సిల్‌కి వెల్ఫేర్ ఫండ్ కింద ఇవ్వాలని కోరారు. 100 కోట్లు కేటాయించి కేవలం 25 కోట్లు మాత్రమే ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకొందన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ 10 లక్షలు ఇవ్వాలని, న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్‌ను 10 లక్షల వరకూ ఇవ్వాలని, అది కూడా సకాలంలో అందజేయాలన్నారు. డెత్ బెనిఫిట్స్, మ్యాచింగ్ గ్రాంట్‌లకు సంబంధించి పెండింగ్‌లో వున్న 30 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. అర్హులైన న్యాయవాదులందరికీ ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. యువ న్యాయవాదులకు లా నేస్తం ప్రతి నెలా అందజేయాలన్నారు. ఐఏఎల్ కడప నగర అధ్యక్షుడు రామకొండయ్య అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, సీనియర్ న్యాయవాదులు సంపత్‌కుమార్, భరణికుమార్ నాయుడు, వెంకటశివ, ఉమాదేవి, చంద్రావతి, అహ్మద్, గురురాజా, మదన్‌మోహన్‌రెడ్డి, జయరాం, మైసూరారెడ్డి, చిన్నయ్య, బాలనరసింహులు, ప్రేమ్‌కుమార్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.


నగర విద్యార్థికి 'ఖాన ఖజానా' అవార్డు




సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఇంటాక్ బృందం

కడప కల్చరల్ : భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన ఖాన ఖజానా వ్యాసరచన పోటీల్లో నగరానికి చెందిన విద్యామందిర్ హైస్కూలు తొమ్మిదో తరగతి విద్యార్థి రుషిక్ ఆచార్యకు జాతీయ స్థాయిలో రీజినల్ అవార్డు దక్కింది. ఇంటాక్ కడప చాప్టర్ ఆధ్వర్యంలో కడప నగరంలో మన ప్రాంత సంప్రదాయ ఆహారం గురించి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇందులో 175 మంది విద్యార్థులు పాల్గొనగా రుషిక్ ఆచార్యకు ఈ బహుమతి లభించింది. చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, కో కన్వీనర్ సుబ్బారెడ్డి, సభ్యులు మంగళవారం విద్యామందిర్ హైస్కూలులో సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇంటాక్ సభ్యుల సమక్షంలో రుషిక్ ఆచార్యకు బహుమతిగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పాఠశాలకు చెందిన మరో 16 మంది విద్యార్థులకు ప్రోత్సాహక ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ మన సంప్రదాయ ఆహార పదార్థాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు, డిమాండ్ ఉన్నాయని, వాటి గురించి మన ప్రాంతాల వారికి అవగాహన కల్పించేందుకు ఈ పోటీ పెట్టామని, దేశ వ్యాప్తంగా ఇలాంటి పోటీలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ టూరిజం సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్ రాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య కార్యదర్శి గౌరీశంకర్, పూర్వ అధ్యక్షులు జోజిరెడ్డి, కొండారెడ్డి, గునిశెట్టి శ్రీనివాసులు, రాఘవేంద్రవర్మ, మనీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేస్తున్న కేవీకే, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్లు



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని కృషి విజ్ఞానకేంద్రంలో మంగళవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణలు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ దాస్య శృంఖలాలను తెంచడానికి ప్రాణాలను అర్పించిన వీరుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, ప్రశాంతి, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు రామలక్ష్మిదేవి, ప్రత్యూష, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : ప్రజలకు సేవ చేయడంలో అల్లూరి సీతారామరాజు ముందుడే వారని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున అన్నారు. కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగరాజు, జిల్లా కార్యదర్శులు కృష్ణానాయక్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

మందుల వల్ల దుష్ప్రభావాలు కలిగితే చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కడప రిమ్స్ ఫార్మకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి

కడప అర్బన్ : రోగులు వాడే మందుల వలన దుష్ప్రభావం కలిగిన వెంటనే ఆయా మందుల వ్యవహారంపై ఔషధనియంత్రణ విభాగం వారికి ఫిర్యాదు చేయాలని కడప రిమ్స్ ఫార్మకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ వై.విజయభాస్కర్‌రెడ్డి తెలియజేశారు. మంగళవారం కడప ప్రభుత్వ సర్వజన వైద్యశాల (రిమ్స్)లోని ఐపీ విభాగం లెక్చర్ హాల్‌లో మందుల వలన కలిగే దుష్ప్రభావాలపై ఎలా రిపోర్ట్ చేయాలి, ఎవరికి చేస్తే త్వరగా ప్రయోజనం వుంటుంది, డాక్టర్స్ తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ, సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, వైద్య కళాశాలకు చెందిన ప్రొఫెసర్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.